వసతి గృహాలపై పట్టింపేదీ?

- సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఇబ్బందులు
- ఘటన జరిగినప్పుడే అధికారుల పరుగులు
- జూనియర్లపై సీనియర్ల దాడులు



గోపాల్‌పేటలో ప్రైవేట్ షెడ్‌లో కొనసాగుతున్న బీసీ హాస్టల్

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక మూడో తరగతిలోనే హాస్టళ్లలో చేరుతున్న విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు నుంచి తీవ్ర సమస్యలు ఎదురవుతున్నట్లుగా తెలుస్తోంది. సీనియర్ విద్యార్థుల నుంచి వేధింపులు జరిగినప్పుడు వార్డెన్ అందుబాటులో లేకపోవడంతోనే విద్యార్థులు సతమతం అవుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. వేధింపులు, కొట్టడం జరిగినప్పుడు విద్యార్థులు ఏం చేయాలో తోచక పాఠశాలకు వెళ్లే సమయంలో రోడ్లపై వెళ్తున్న వారి నుంచి ఫోన్లు తీసుకొని తల్లిదండ్రులకు, సంబంధీకులకు కాల్ చేసి తనను ఇతరులు కొట్టారని, లేదంటే వేధింపులకు గురిచేశారని వాపోతున్నారు. మూడు నెలల క్రితం నుంచి గోపాల్‌పేట ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఇద్దరేసి చొప్పున నలుగురు విద్యార్థులు చిన్న పిల్లలను కొడుతున్నారని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి హాస్టల్ నుంచి వారిని ఇంటికి పంపించారంటే సమస్య ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఉమ్మడి మండలంలో..

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో రెండు ఎస్సీ, ఒక బీసీ, బాలికల బీసీ హాస్టళ్లు ఉన్నాయి. నాలుగు హాస్టళ్లలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు కలిపి మొత్తం 400 మంది విద్యార్థుల వరకు చదువుతున్నారు. గోపాల్‌పేటలో బాలుర బీసీ హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో ప్రైవేట్ షెడ్‌లో కొనసాగిస్తున్నారు. కిటికీలు, తలుపులు, గదులు సరిగా లేకపోవడంతో ఇక్కడ వర్షాకాలం, చలికాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. తాగునీటి సమస్యకూడా వేధిస్తోంది. గోపాల్‌పేటలోని ఎస్సీ హాస్టల్‌లో ఇటీవల ఓ విద్యార్థి గుండెపోటుతో మరణించాడు. ఆ మరుసటిరోజు మరో విద్యార్థి ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుంచి బిజినేపల్లికి బస్సుపై, ఆ తర్వాత ద్విచక్ర వాహనాలను లిఫ్ట్ అడుగుతూ హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. మరుసటి రోజు వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడని విద్యార్థి తండ్రి చెబితేనే తెలిసింది. వార్డెన్లు హాస్టళ్లలో ఉండకపోవడం వల్లనే పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాలకు సరిగా వెళ్లకుండా రాత్రి పది గంటల వరకు బయటే తిరుగుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి వార్డెన్లు హాస్టళ్లలో ఉండి సీనియర్ల నుంచి జూనియర్ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హాస్టళ్లలో వార్డెన్లు ఉండాలి



హాస్టల్ విద్యార్థులు గోపాల్‌పేటలో రోడ్లపై ఎక్కడబడితే అక్కడ జనాల వద్ద సెల్‌ఫోన్లు తీసుకుని తల్లిదండ్రులకు ఫోన్లు చేయడం చూశా. రెండు రోజుల క్రితం నా వద్ద సెల్‌ఫోన్ తీసుకుని వారి తల్లితండ్రులకు ఫోన్‌కాల్ చేసి పదో తరగతికి చెందిన సీనియర్ తనను కొట్టాడని చెప్పాడు. వార్డెన్ అందుబాటులో ఉంటే విద్యార్థులు అలా రోడ్డుపైకి ఎలా వస్తారు.

– గడ్డికోపుల మహేష్,
డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

సమస్యలు పరిష్కరిస్తాం

ఎస్సీ హాస్టళ్లలో విద్యార్థులకు సమస్యలు రాకుండా చూస్తున్నాం. గతంలో ఒకరిద్దరు విద్యార్థులు వినడం లేదని వార్డెన్ సమస్యను నా దృష్టికి తీసుకొచ్చారు. భయపెట్టకుండా కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించా. ప్రస్తుతం మేము ఆయా హాస్టళ్లను పరిశీలిస్తున్నాం. వార్డెన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున్,
ఎస్సీకార్పొరేషన్ ఈడీ, వనపర్తి జిల్లా

క్లుప్తంగా

విద్యార్థి భవిష్యత్‌కు పదో తరగతి కీలకం



పాన్‌గల్: విద్యార్థి ఉన్నతికి పదో తరగతి చాలా కీలకమని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యానికి అనుగుణంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ప్రణాళిక ప్రకారం వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ప్రముఖ రచయిత, సైకాలజిస్ట్ యండమూరి వీరేంద్రనాథ్ రచించిన 'టాప్ ర్యాంక్ నూరు సూత్రాలు' పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కిరణ్, విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ



వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పక్కన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి మున్సిపాలిటీ పక్కన ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయానికి పూజారి శ్రీహరి తాళం వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి గేట్లు తెరుచుకొని ఉండటం గమనించిన పూజారి ఆలయ చైర్మన్ రామచంద్రారెడ్డికి ఫోన్ చేసి చెప్పడంతో.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు క్లూస్‌టీం తో ఆధారాలు సేకరించారు. హుండీలో ఉన్న సుమారు రూ.20 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పూజారి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వం



ఆత్మకూర్: పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ చికినె శశిధర్ తెలిపారు. గురువారం స్థానిక నేతాజీనగర్‌లోని మహబూబ్‌సుభాని దర్గా వద్ద బోర్ మోటారు చెడిపోవడంతో మరమ్మతులు చేపట్టి సత్వర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిషన్ భగీరథ పథకంతో పాటు బోర్ల ద్వారా పట్టణంలో ప్రతి నిత్యం తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

సీపీఎస్, యూపీఎస్‌కు వ్యతిరేకంగా యుద్ధభేరి

మానవపాడు: సీపీఎస్, యూపీఎస్‌కు వ్యతిరేకంగా మార్చి 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియాన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేయకుండా దాని స్థానంలో యూనిఫైడ్ స్కీమ్‌ను తీసుకురావడాన్ని టీఎస్‌సీపీఎస్‌ఈవీ ఖండిస్తుందన్నారు. సీపీఎస్ విధానంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్ రూ.2500 నుంచి రూ.5వేల వరకు మాత్రమే వస్తుందని, లోపభూయిష్టమైన యూపీఎస్, సీపీఎస్ విధానాలు రద్దు చేసి దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, సురేష్, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జయమ్మ, శ్రీధర్‌రెడ్డి, మంజుల, మేరి, నిరంజన్‌రెడ్డి, ప్రభావతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీనియర్ సివిల్ జడ్జి రాక

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చీకరుచెట్టుతండాను శుక్రవారం ఉదయం 8 గంటలకు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రజిని సందర్శించనున్నారని తండా మాజీ సర్పంచ్ రాధాకృష్ణనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా న్యాయ అధికార సేవా సంస్థ తరపున ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు ఇవ్వడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. తండాలో చట్టపరమైన సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

830 మందికి మధుమేహ పరీక్షలు



పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోప్లాపూర్‌లో కొనసాగుతున్న పరీక్షలను సీహెచ్‌ఓ రామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 30 ఏళ్లు దాటిన వారందరూ విధిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. షుగర్ పరీక్షలు చేయించుకోవడంతో వ్యాధి నిర్ధారణ అయితే ఆహారపు అలవాట్లను మార్చుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 830 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

అవినీతి అధికారిని సస్పెండ్ చేయాలి



ఏదులలో నూతన కమిటీని సత్కరిస్తున్న రాచాల యుగంధర్

వనపర్తి: అవినీతి అక్రమాలకు పాల్పడిన బీసీ వెల్ఫేర్ అధికారిని సస్పెండ్ చేయాలని గురువారం బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్ కమిషనర్ అనుమతి లేకుండా తన డ్రైవర్, అటెండర్ల పేరుతో రూ.16 లక్షల నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య యాదవ్, వీవీ గౌడ్, రాఘవేందర్, అంజన్న, మల్లేష్, శివ, రామన్ గౌడ్, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే ఎజెండా

గోపాల్‌పేట: ఏదుల మండలంలో పొలిటికల్ జేఏసీ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య సమక్షంలో జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గువ్వల హనుమంతు, మండల ప్రధాన కార్యదర్శిగా దాసరి జానకీరాములును నియమించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ.. తొందరలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న, ఏదుల మాజీ సర్పంచు మశన్న, లక్ష్మీకాంతాచార్యులు, వెంకటయ్య, పరశురాములు, ఉషన్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వనపర్తి రూరల్: గోపాల్‌పేట మండలంలోని ఏదుట్లకు చెందిన యువకుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు ఏదుట్లకు చెందిన తైదండి ఆంజనేయులు వనపర్తి పట్టణంలో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో అతడు గురువారం ఉదయం నేను చనిపోతున్నా అని ఉత్తరం రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి సోదరుడు జానకీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

తిరుమలలో పిన్నంచర్ల గ్రామస్తుల భజన

ఆత్మకూర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో మండలంలోని పిన్నంచర్ల భజన మండలి ఆధ్వర్యంలో భజన ఆలపించారు. గురువారం తిరుమలలో పిన్నంచర్ల గ్రామస్తులు భజన, సంకీర్తనలతో భక్తిపాటలు పాడి ఆలయ నిర్వాహకులచే ప్రశంసలను పొందారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు మచ్చేందర్‌గౌడ్, శివానంద్‌రెడ్డి, జంగన్న, నారాయణరెడ్డి, శ్రీను, హుజూర్ రాములు, సత్యన్న, జగన్, వెంకటన్న, ఆంజనేయులు, నరేందర్, రాములు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వనపర్తి రూరల్: రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఎంహెచ్‌టీ 2, 4 టీంల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని చిట్యాల, నాగవరం ఎంజేపీ పాఠశాలలు, జెడ్పీహెచ్‌ఎస్, మైనార్టీ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్యులు డా.శ్రీధర్, డా.స్వప్న కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా.సాయినాథ్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డా.పరిమళ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం డా.రఘు, డా.మతీన్, ఫార్మాసిస్టులు శ్రీవిద్య, ఫైజాశబ్నం, పీఎంఓ మురళి, ఏఎన్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

సాక్షి, నెట్‌వర్క్: ఖిల్లాఘనపురం మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాల, ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాలలో, వనపర్తి మండలంలోని కిష్టగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జయశంకర్, హార్ట్‌ఫుల్ ధ్యానం సభ్యుడు దీర్ఘాయువు, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంటేశ్వర్‌గౌడ్ బాలసుబ్రమణ్యం, శ్రీనివాసులు, కృపాకర్, చైర్‌పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఆరోగ్య సాధనాలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ఆనంద్

కొత్తకోట: ప్రస్తుతం యువత క్రీడలను ఆరోగ్య సాధనాలుగా మార్చుకోవాలని కొత్తకోట ఎస్‌ఐ ఆనంద్ అన్నారు. గురువారం పట్టణంలో కొత్తకోట ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో ఏడో రోజు నిర్వహించిన సెమీఫైనల్ క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తినే ఆహారం చాలా వరకు కలుషితం కావడం వల్ల యువత అనారోగ్యాలకు గురవతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు యువత ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకొని నిత్యం వాటిని ఆరోగ్య సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరం కావడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, గుంత శివ, రఘు, కార్తీక్, సాయి, సన్ని, మహేష్, శివశంకర్, తరుణ్, గణేష్, అరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం'



మాట్లాడుతున్న బాల్యనాయక్

పాన్‌గల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. గురువారం మండలంలోని రేమద్దులలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామాల్లో వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకటయ్య, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి మాలధారులు

వీపనగండ్ల: 40 రోజులుగా శివ మాలలు ధరించి మండల కేంద్రంలోని శివాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన మాలధారులు గురువారం ఇరుముడి కట్టుకొని శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.



జిల్లా స్థాయిలో పాన్‌గల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందజేస్తున్న అధికారులు

పాన్‌గల్: విజ్ఞాన దర్శిని సైన్స్ మహోత్సవ సంబరాల్లో భాగంగా 'వైజ్ఞానానికి ఆలోచన – మానవ ప్రగతి పథం' అనే అంశంపై జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన వివిధ పోటీల్లో పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీలో ఇంగ్లిష్ మీడియం నుంచి రాకేష్ ప్రథమ బహుమతి, తెలుగు మీడియంలో పాటల విభాగంలో మణికంఠ ప్రథమ బహుమతి, ఉపన్యాస విభాగంలో సౌమ్య (8వ తరగతి) ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీలో పల్లవి (10వ తరగతి) ప్రథమ బహుమతి సాధించినట్లు వారు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయి అధికారుల నుంచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల గైడ్ టీచర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మల్లేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి నోచుకోని అమరచింత

- మున్సిపాలిటీగా మారినా తెరుచుకోని వైనం



నిరుపయోగంగా గ్రంథాలయ భవనం

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూతపడి ఉన్నా మున్సిపల్ అధికారులు, పాలక మండలి పట్టించుకోవడం లేదు. పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గదిని కేటాయించినా నిర్వహణ భారంతో మూతపడింది. కనీసం దినపత్రికలు చదవాలనుకున్న వయోజనులు మూతపడిన గ్రంథాలయం ఎన్నడు తెరుస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అమరచింత గ్రామంగా ఉన్నప్పుడు కొంతమంది యువకులు స్వచ్ఛందంగా గ్రంథాలయం పునరుద్ధరణ కోసం విరాళాలు సేకరించి ప్రతి నెల దినపత్రికలతో పాటు విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. దాతల సహకారంతో కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసి నెలసరి వీటిని నిర్వహించే వ్యక్తికి గౌరవ వేతనం ఇచ్చే వీలును కల్పించారు. ప్రస్తుతం దాతలు ముందుకు రాకపోవడంతో నిర్వహణ భారమై గ్రంథాలయం మూతపడింది. మున్సిపాలిటీగా మారిన తర్వాత గ్రంథాలయానికి పూర్వవైభవం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం గ్రంథాలయానికి కేటాయించిన భవనం తలుపులకు వేసి ఉన్న తాళాలు పగిలిపోవడంతో భవనంలో పర్నీచర్‌కు రక్షణ కరువైంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలక వర్గం స్పందించి గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పక్కాగా ప్రత్యేక అవసరాల విద్యార్థుల నమోదు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అధికారి యుగేందర్

ఖిల్లాఘనపురం: భవిత కేంద్రానికి వచ్చే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల నమోదు పక్కాగా ఉండాలని జిల్లా విలీన విద్య సమన్వయ కర్త యుగేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన పలు కార్యక్రమాల రికార్డులను పరిశీలించారు. ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీ క్యాంపులకు హాజరైన విద్యార్థుల సంఖ్యకు సంబంధించిన వివరాలు, కేంద్రంలో ఇప్పటి వరకు నమోదు చేసిన విద్యార్థుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఈ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కేంద్రంలో కల్పించాలన్నారు. పిల్లల ప్రొఫైల్, ఐఈపీలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ కేంద్రానికి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత రవాణా ఖర్చులు, ఉచిత ఉపకరణాలు మొదలైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ మల్లీశ్వరి, సీఆర్పీ వెంకటేష్, ఎంఐఎస్ ఆపరేటర్ పవన్ కుమార్, తిరుపతయ్య, కేర్‌టేకర్ ఉన్నారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యం తగదు



ఆత్మకూర్ మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీపాద్

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యం తగదని, కూలీలందరికీ న్యాయం చేయాలని ఎంపీడీఓ శ్రీపాద్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. రైతుల పొలాల్లో భూమి చదును చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నర్సరీల ఏర్పాటు, ఉపాధి కూలీలకు టెంట్లు, తాగునీరు, కూలీల పెంపు, పనుల పురోగతి, తదితర విషయాలపై చర్చించారు. నిర్దేశించిన పనులు మార్చి చివరిలోగా పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్ రెడ్డి, టెక్నికల్ పీఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, అంగన్‌వాడీల పరిశీలన

గోపాల్‌పేట: ఏదుల మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలు, నర్సరీలు, అంగన్‌వాడీలు, సబ్ సెంటర్‌ను గురువారం ఎంపీడీఓ రాములు పరిశీలించారు. చెన్నారం, మాచుపల్లి, సింగాయిపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. చెన్నారం సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎం, సెకండ్ ఏఎన్‌ఎం లేదని తెలుసుకున్న ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హెల్త్ చెకప్‌లు జరుగుతుండగా అనుమతి తీసుకోకుండా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సెక్రెటరీలు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు అందరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చెన్నారం ఉన్నత పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ఏదుల ఎంపీడీఓ రాములు